సాక్షి 24|7
చిత్తూరు
శనివారం 2-4-2016

సాక్షి చిత్తూరు | శనివారం |
ఏప్రిల్ | 2 | 2016

# వనరుల వినియోగంతోనే అభివృద్ధి

- సీపీఐ జాతీయనేత డాక్టర్ నారాయణ
- పలువురికి శతాబ్ది పురస్కారాల ప్రదానం




నారాయణకు విశిష్ట రత్న పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య ఎల్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ సుందర్‌రామ్

**తిరుపతి రూరల్:** ప్రకృతి ప్రసాదించిన వనరులను సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి సాధ్యమని సీపీఐ జాతీయ నేత డాక్టర్ నారాయణ తెలిపారు. భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమి(అగ్రశ్రీ) సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని ఓ హోటల్‌లో జిల్లా 106వ అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవ చేసిన జిల్లాకు చెందిన ప్రముఖులకు విశిష్ట రత్న, విశిష్ట శిరోమణి పురస్కారాలు ప్రదానం చేశారు. నారాయణ జిల్లా శతాబ్ది విశిష్ట రత్న -2015 అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ''జిల్లాలో సంతులిత అభివృద్ధి : భవిష్యత్తు ప్రణాళికలు''అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. నీటితోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని, ప్రస్తుత పాలకులు ఆధునీకరణ పేరుతో చెరువులను ధ్వంసం చేస్తుండడం బాధాకరమని తెలిపారు. జిల్లాలో చెరువుల వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**అవార్డులు అందుకున్న ప్రముఖులు..**

అగ్రశ్రీ సంస్థ జిల్లా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా విశిష్ట పురస్కారాలను ఐదేళ్లుగా ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది జిల్లా శతాబ్ది విశిష్ట రత్న -2015 పురస్కారానికి డాక్టర్ నారాయణను ఎంపిక చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధ్యక్షులు ఆచార్య వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. మాజీ స్పీకర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ దుర్గ, అగ్రశ్రీ వ్యవస్థాపకులు డాక్టర్ సుందరరామ్, భారతి చేతుల మీదుగా న్యాయ శిరోమణి అవార్డును హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నారాయణ అందుకున్నారు. విద్యా శిరోమణి అవార్డును ద్రవిడ వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య పీవీ అరుణాచలం, వైద్య శిరోమణి అవార్డును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యాం, సాహిత్య శిరోమణి అవార్డును ప్రముఖ తెలుగు సాహిత్య పరిశోధకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, యువ శిరోమణి అవార్డును టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, మహిళా శిరోమణి అవార్డును సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి ఎస్.లక్ష్మి, జ్యూరీ ప్రత్యేక పురస్కారాన్ని బర్డ్ సంచాలకులు డాక్టర్ జగదీష్ అందుకున్నారు.

**ప్రత్యేక సంచిక ఆవిష్కరణ..**

ఈ సదస్సులో అగ్రశ్రీ సంస్థ ప్రచురించిన విశేష సంచిక, బ్రోచర్‌లను మాజీ ఎంపీ దుర్గ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సుధాకర్ మోహన్, సుచరిత పాల్గొన్నారు.

## శతాబ్ది పురస్కారాలు



అగ్రశ్రీ సావనీర్ ను విడుదల చేస్తున్న అతిథులు

భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమి(అగ్రశ్రీ) సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని ఓ హోటల్‌లో జిల్లా 106వ అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన జిల్లాకు చెందిన ప్రముఖులకు విశిష్ట రత్న, విశిష్ట శిరోమణి పురస్కారాలను ప్రదానం చేశారు. - తిరుపతి రూరల్